
సెప్సిస్ ప్రాణాంతకమే..

- తీవ్ర అనారోగ్యానికి గురిచేస్తుంది
- ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడుతున్న ప్రజలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

గుంటూరు మెడికల్: ఇన్‌ఫెక్షన్ తరచూ వాడే పదం. సాధారణంగా నలతగా ఉందంటే ఇన్‌ఫెక్షన్ సోకింది అంటూ ఉంటాం. కానీ ఏ ఇన్‌ఫెక్షన్ అనేది నిర్ధారణ చేయలేం. వైదులు వివిధ పరీక్షల చేసిన తరువాతే చెప్పగలరు. వీటిపై అంతులేని నిర్లక్ష్యం. ఇన్‌ఫెక్షన్ ప్రాణాంతకం అయినా మన వైద్యమే చేస్తుంటాం. ఇలాంటి సందర్భాల్లో అనేక మంది ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇన్‌ఫెక్షన్‌లను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌ను సెప్సిస్ అంటారు. శరీరంలో సోకే ఎలాంటి ఇన్‌ఫెక్షన్ అయినా అదుపు చేయకపోతే అది తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు (సెప్సిస్)కు దారి తీయవచ్చు. 80 శాతానికి పైగా ఇన్‌ఫెక్షన్‌లు ఆసుపత్రి బయటే సోకుతున్నాయి.

సెప్సిస్ ఎవరికి సోకుతోంది..

ముఖ్యంగా 60 సంవత్సరాలు దాటిన వారికి, చిన్న పిల్లలకు ఊపిరితిత్తులు, గుండె, లివర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, హెచ్ఐవీ బాధితులకు, షుగర్ వ్యాధి బాధితులకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సోకే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం ఐదు కోట్ల మంది సెప్సిస్ వ్యాధి బారిన పడుతున్నారు. వీరిలో కోటి మంది ప్రాణాలు ప్రమాద స్థితికి చేరుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం మంది సెప్సిస్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఈనేపథ్యంలో ఇన్‌ఫెక్షన్‌లపై అవగాహన కల్పించేందుకు 2012 నుంచి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు నెలను వరల్డ్ సెప్సిస్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.



సెప్సిస్ పోస్టర్లు

వ్యాధి నిర్ధారణ....

బ్లడ్ కల్చర్, కార్బాఆర్, బయోఫయర్ టెస్టల ద్వారా సెప్సిస్ వ్యాధిని నిర్ధారిస్తారు. అంటు వ్యాధి కారకాలు, వాటి విషపూరిత పదార్థాల వ్యాప్తి, వాటి స్థానం నుంచి రక్త ప్రవాహంలో కలవడం ద్వారా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. ఇది ఒక ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన జబ్బు. తక్షణమే గుర్తించి చికిత్స చేయని పక్షంలో శరీరంలోని పలు అవయవాలు ఇన్‌ఫెక్షన్‌ల వల్ల పనిచేయడం మానివేసి రోగి ప్రాణాలు కోల్పోతాడు.

జిల్లాల్లో బాధితులు ....


గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ పది మంది బాధితులు సెప్సిస్‌తో బాధపడుతూ జనరల్ మెడిసిన్ విభాగానికి చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో ఫిజీషియన్లు 120 మంది ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 10 మంది ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు. వీరికి సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందించని పక్షంలో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌గా (సెప్సిస్) మారి రోగులను ఐసీయూలో అడ్మిట్ చేయాల్సి వస్తుంది.

వ్యాధి సోకే భాగాలు ....

నూటికి 50 శాతం ఊపిరితిత్తులు. కిడ్నీలు, బ్రెయిన్, యూరినరి ట్రాక్ట్, చర్మం, ఇతర భాగాల్లో వ్యాధి ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. కడుపులో ఇన్‌ఫెక్షన్లు రావడం ద్వారా అల్సర్లు ఏర్పడతాయి. కాళ్లల్లో పుండ్లు ఏర్పడి చీము పట్టి పరిస్థితి ప్రమాదంగా మారి కొన్ని సార్లు ఆపరేషన్‌ల ద్వారా ఆ గాయాలను తొలగించాల్సి వస్తుంది.

లక్షణాలు ....

ఇది సూక్ష్మ క్రిముల ద్వారా వస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రతలు హెచ్చు తగ్గులుగా ఉండటం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా తీసుకోవడం, విపరీతమైన నీరసం, తీవ్రమైన చలి, ఆయాసం, మూత్ర విసర్జన తగ్గిపోవడం, బీపీ తగ్గడం, పెరగడం, రోగి తికమక పడడం, తదితర లక్షణాలు వ్యాధి బాధితుల్లో కనిపిస్తాయి.



సెప్సిస్‌పై 3డీ దాడి



సెప్సిస్ నియంత్రించాలంటే 3డీ దాడి చేయాల్సి ఉంటుంది. తొలుత ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ కచ్చితంగా జరగాలి. నిర్ధారణ అనంతరం నియంత్రణకు అవసరమైన చికిత్స చేయించాలి. మల్టిప్లెక్స్ పీసీఆర్ అనే అధునాతన వైద్య పరీక్ష ద్వారా త్వరితగతిన సెప్సిస్‌ను నిర్ధారించవచ్చు. బయోఫైర్ ద్వారా మూడు గంటల్లో నిర్ధారణ చేయవచ్చు. నిర్ధారణతోపాటు ఇన్‌ఫెక్షన్ నియంత్రణకు కావాల్సిన మందులు వాడాలి. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు యాంటిబయాటిక్స్ వైద్యుల సలహాలు మేరకు మాత్రమే వాడాలి.

–డాక్టర్ కోగంటి కళ్యాణ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు

క్లుప్తంగా

కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా ఏసీ కళాశాల జట్టు



గుంటూరు ఎడ్యుకేషన్: బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా ఏసీ కళాశాల జట్టు నిలిచింది. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెంలో ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించిన గుంటూరు జిల్లా డిగ్రీ కళాశాలల స్థాయి బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లో ఏసీ కళాశాల జట్టు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. సోమవారం సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో విజేతగా నిలిచిన జట్టు సభ్యులను అభినందించారు. మోజెస్ మాట్లాడుతూ తమ కళాశాల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి చాంపియన్‌షిప్ ట్రోఫీతో పాటు రూ.ఐదు వేల నగదు బహుమతిని కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్, కాలేజీబోర్డు చైర్మన్ డాక్టర్ ఎంఎస్ శ్రీధర్, ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్, నాక్ కో–ఆర్డినేటర్లు డాక్టర్ పీఎం వినయ్‌తేజ, డాక్టర్ వి.ఎజ్రా విజయశేఖర్, డాక్టర్ ఎం.ఖాను, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ జీపీ ప్రీతమ్‌ప్రకాష్ విద్యార్థులను అభినందించారు.

ప్రజా హక్కుల పోరాట యోధుడు బొజ్జా తారకం



నెహ్రూనగర్: న్యాయవాదిగా ప్రజా హక్కుల కోసం అహర్నిశలు పోరాటం చేసిన పోరాట యోధుడు బొజ్జా తారకం అని భీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. బొజ్జా తారకం వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా, రచయితగా కవిగా తనకున్న మేధను దళిత గిరిజనుల హక్కుల కోసం ఎంతగానో శ్రమించిన విప్లవ యోధుడు బొజ్జా తారకం అని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బీసీ మహాజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, డెమొక్రటిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చాట్ల డేన్నిస్ రాయ్, దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ శిఖా సురేష్, ప్రజా పోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరావు, న్యాయవాది శ్రీనివాస్, జోజి, తిరువళ్లూరు హరినాథ్ బాబు పాల్గొన్నారు.

ఏపీజీఈఏతో సూర్యనారాయణకు సంబంధం లేదు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి అవినీతి ఆరోపణలతో కేసుల్లో ఇరుక్కున్న కేఆర్ సూర్యనారాయణకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ)తో ఎటువంటి సంబంధం లేదని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌కుమార్, పి.అమ్మయ్య పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ ప్రాంగణంలో ఏపీజీఈఏ గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీజీఈఏ నుంచి బహిష్కరించబడిన కేఆర్ సూర్యనారాయణ దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా అవినీతి ఆరోపణలతో ఇప్పటికీ సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారని తెలిపారు. ఏపీజీఈఏకు తానే నాయకుడినని చెప్పుకుంటూ, సంఘ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న జి.ఆస్కార్‌రావుపై చేసిన తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని అన్నారు. సూర్యనారాయణ తీరు మార్చుకోకుంటే సంఘ పరంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

గుంటూరు మెడికల్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం గుంటూరులోని జిల్లా కార్యాలయంలో ధార్మిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు విధి విధానాల్ని పార్టీ కార్యకర్తలు, ధార్మిక సంఘాల, బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘాల ప్రతినిధులకు వివరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని అత్యధిక స్థాయిలో పెంచుతూ పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సాధారణ సభ్యత్వం నుంచి, క్రియాశీలక సభ్యత్వం వరకు అత్యధిక సంఖ్యలో చేసి లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. రాష్ట్ర నాయకులు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి మాట్లాడుతూ ధార్మిక విభాగం నుండి ప్రతి జిల్లా నుండి కూడా పదివేలకు తగ్గకుండా సాధారణ సభ్యత్వాన్ని చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా వంద మందిని సాధారణ సభ్యులుగా చేర్చాలని కోరారు. నాయకులు టి. అనంతచార్యులు, వెలగలేటి గంగాధర్, పి.రంగవల్లి, ధార్మిక విభాగం జిల్లా కన్వీనర్ ప్రతాప ప్రసాద్, ఏలూరి లక్ష్మి, డాక్టర్ స్రవంతి, పొన్నపల్లి సోమశేఖర్, అంకరాజు నరసింహ మూర్తి, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుండి వచ్చిన బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘాల ముఖ్య నాయకులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న జూపూడి రంగరాజు, వేదికపై జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

గుంటూరు మెడికల్: రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నిరసన నిర్వహించారు. నగర ప్రధాన కూడలిలోని శంకర్ విలాస్ వద్ద నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి రాహుల్ బొమ్మకు చెప్పుల దండ వేసి చెప్పులతో కొట్టి రాహుల్ ఖాన్ చేసిన వ్యాఖ్యలకు తక్షణమే జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, నాయకులు జె.శ్రీనివాసరావు, ఈ.శ్రీనివాస్ రెడ్డి, కుమార్ గౌడ్, తిరుపతిరావు, డి.శ్రీనివాస్ రేణుక పాల్గొన్నారు.

వ్యర్థాలను కాలువల్లో వేస్తే కఠిన చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల వెంబడి ఉన్న కొబ్బరి బోండాలు, టిఫిన్, టీ విక్రయదారులు వ్యర్థాలను రోడ్ల మీద, డ్రెయిన్‌లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, శాంతి నగర్, జీటీ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వివిధ వ్యాపారాలు చేసేవారు వ్యర్థాలను రోడ్ల మీద, కాలువల్లో వేస్తున్నారని, ప్రధానంగా కొబ్బరి బోండాలు డ్రెయిన్‌లలో వేయడం వలన మురుగుపారుదలకు అడ్డంకిగా ఉంటుందన్నారు. శాంతి నగర్, సంపత్ నగర్‌లో స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్దేశిత సమయాల్లో విధుల్లో ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ లక్ష్మణ స్వామి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నేటి నుంచి స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు

స్వచ్ఛత హి సేవలో భాగంగా మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, విజ్ఞాన మందిరం, ఎన్టీఆర్ స్టేడియాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ చేయించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని గుంటూరు నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛ గుంటూరు లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

మానవళి మనుగడకు ఓజోన్ పొర కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: భూ మండలంలోని సమస్త మానవాళితో పాటు సకల జీవరాసుల మనుగడకు ఓజోన్ పొరను కాపాడుకోవటం అత్యంత అవసరమని ప్రజ్ఞ పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఓజోన్ పొరను పరిరక్షించుకోలేకుంటే వాటిల్లే నష్టాలపై విద్యార్థులకు వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన అనేక నమూనాలను చార్టుల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా చక్రనాగ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికరణ నేపథ్యంలో వాటి నుంచి వచ్చే ఉద్గారాల వలన ఓజోన్ పొరకు నష్టం వాటిల్లుతోందన్నారు. తద్వారా సూర్య కిరణాలు నేరుగా భూమికి తాకటం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఉద్గారాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాయని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగనున్న విద్యార్థులు ఆ దిశగా తమ ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు జోజమ్మ, విజయ కుమారి, జరీనా పాల్గొన్నారు.

మొహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ తోటివారిపై ప్రేమ, కరుణ కలిగి ఉండాలని మొహమ్మద్ ప్రవక్త చేసిన బోధనలు అనుసరణీయమని వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయం వద్ద సోమవారం మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని రెండు వేల మందికి పాయసం పంపిణీ చేశారు. ఈసందర్భంగా నూరిఫాతిమా నియోజకవర్గ ప్రజలకు, ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నగరంపాలెం: తోటి హోంగార్డు కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. డెప్యూటేషన్‌పై ఏపీఎస్పీడీసీఎల్‌లో విధులు నిర్వర్తించే హోంగార్డు జయదాసు అనారోగ్యంతో జూలైలో మృతిచెందారు. ఈ క్రమంలో జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.28 లక్షల చెక్కును జయదాసు భార్య శాంతకుమారికి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఐ వెల్ఫేర్ శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ రత్నరాజు పాల్గొన్నారు.

వాటర్ హ్యాకర్లకు నీటి సరఫరా కొనసాగించాలి

లక్ష్మీపురం: నగరంలో వాటర్ హ్యాకర్లకు నీటి సరఫరా కొనసాగించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నగర వాటర్ హ్యాకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1997 నుంచి కొనసాగుతున్న వాటర్ హ్యాకర్లను నిలిపివేయడం అన్యాయంగా పేర్కొన్నారు. నగర పాలక సంస్థ వారికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాటర్ హాకర్ సంగం నగర అధ్యక్షులు ధూపాటి వెంకటరత్నం, హెచ్ఎల్ఆర్ వాటర్ పీపాల ప్రెసిడెంట్ ఎం.నారాయణ, స్తంభాల గరువు వాటర్ పీపాల ప్రెసిడెంట్ డి.వెంకటేశ్వరరావు, బీఆర్ స్టేడియం పీపాల అధ్యక్షులు ఎం.గురప్ప పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


రైజింగ్ బాయ్స్ ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు


శ్రీనగర్ 7/4లో కొలువు దీరిన విఘ్నేశ్వరుడు


అమరావతి రోడ్డులో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు

గుంటూరు ఎడ్యుకేషన్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథులు సోమవారం నిమజ్జనానికి బయలుదేరివెళ్లారు. అమరావతి రోడ్డులో సోమవారం రాత్రి గణనాథుని విగ్రహాలు అమరావతిలోని కృష్ణానదిలో నిమజ్జనానికి వెళుతున్న దృశ్యాలు కనువిందు చేశాయి.

- అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజం సమీపంలో ది రైజింగ్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహానికి 14 రోజుల పాటు పూజలు నిర్వహించనున్నారు.
- శ్రీనగర్ 7/4లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని నిలువెత్తు విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది.

ముగిసిన యూటీఎఫ్ క్రీడా, సాంస్కృతిక పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలు సోమవారం ముగిశాయి. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో భాగంగా ఆయా విభాగాల్లో విజేతలను ప్రకటించారు. షటిల్, చెస్, క్యారమ్స్, వాలీబాల్, క్రికెట్ పోటీలకు 300 మంది ఉపాధ్యాయులు, 20 మంది పీఈటీలు పాల్గొన్నారని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఈసందర్భంగా నాయకులు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, కె.ప్రభూజీ పాల్గొన్నారు.


క్రికెట్ విన్నర్స్‌తో హనుమంతరావు, కళాధర్

29న జేవీవీ కథల పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈనెల 29న కథల పోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసేందుకు ఈనెల 29న ఉదయం 10 గంటలకు ఏసీ కళాశాలలో నిర్వహించనున్న పోటీలకు ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా విద్యార్థులు పాల్గొనచ్చునని చెప్పారు. విద్యార్థులు రాసిన కథల నుంచి ఎంపిక చేసిన కథలను గుంటూరు జిల్లా పిల్లల కథలు పేరుతో విద్యార్థి పేరు, ఫొటో, పాఠశాల, తల్లిదండ్రుల పేర్లతో పుస్తకాన్ని ముద్రించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 90004 53600, 99480 15701, 97035 79996 నంబర్లలో సంప్రదించాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి. వెంకటరావు, ఎస్ఎం సుభానీ, బి.శంకర్‌సింగ్, బి.ప్రతాప్‌సింగ్, ఇ.అనిల్‌కుమార్, ఎస్.వేణుగోపాల్, ఎండీ అక్బర్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

‘హంజా అలీ’ మరిన్ని విజయాలు పొందాలి

గుంటూరు మెడికల్: నేటి సమాజానికి మంచి మెసేజ్ ఓరియెంటెడ్ సినిమా తీసి అందరి మన్ననాలు పొందుతున్న హంజా అలీ నా సోదరుడు కావడం చాలా గర్వంగా ఉందని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్ పిఎస్) ఉమెన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. హంజా అలీ భవిష్యత్తులో మరిన్ని సినిమాలు తీసి మరిన్ని విజయాల పొందాలని ఆకాంక్షించారు. హోప్ విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక ఐటీసీ వెల్కమ్ హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తాన 'పేక మేడలు' చిత్రం ఎడిటర్ అండ్ స్క్రీన్ ప్లే రైటర్ హంజా అలీకి 'అప్రిసియేషన్' అవార్డుతో ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఒక లక్ష్యం దిశగా పని చేయాలని, ఆ దిశగా పని చేయడం వలన విజయం వర్తిస్తుందనడానికి హంజా అలీ నిదర్శనమన్నారు. మద్యపానం వ్యసనానికి గురై తమ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్న వాళ్లకు 'ఐ ఓపెనర్' గా పేకమేడలు సినిమా నిలుస్తుందని పేర్కొన్నారు. హంజా అలీ భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని సినిమాలు తీసి మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ షమ సుల్తానా కుటుంబ సభ్యులు, హంజా అలీ కుటుంబ సభ్యులు, హోప్ విన్ హాస్పిటల్స్ సభ్యులు, సినిమా రంగ అభిమానులు పాల్గొన్నారు.


జ్ఞాపిక బహూకరిస్తున్న డాక్టర్ షమ సుల్తానా

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: మహిళను వేధింపులకు గురిచేసి దుర్భాసలాడిన వ్యక్తిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కేవీపీ కాలనీలో నివాసం ఉండే బాషా నగరంపాలెంలోని ఐటీసీ వద్ద టిఫిన్ బండి నిర్వహిస్తుంటాడు. బాషా అక్క మెహబున్నీసా భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆమెను వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. సోమవారం ఆమెను ద్విచక్ర వాహనంపై అడ్డుపడి వేధింపులకు గురిచేయడంతోపాటు, దుర్భాషలాడడంతో మెహబున్నిసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్వర న్యాయమే లక్ష్యం

లక్ష్మీపురం: సత్వర న్యాయమే ధ్యేయంగా న్యాయ వ్యవస్థలు వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచాలని న్యాయవాది, విశ్లేషకులు ముప్పాళ్ల ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి అధ్యక్షతన వరల్డ్ లా డే సోమవారం నిర్వహించారు. సమావేశంలో న్యాయవాది అవధానుల హరి, పి.ఎస్.మూర్తి పాల్గొని ప్రసంగించారు.

రాంబాబుకు తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారం



నెహ్రూనగర్: గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాల కళాకారుడు వేముల రాంబాబుకు తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారం లభించింది. ఆదివారం రాత్రి విజయవాడ బాలోత్సవ భవన్‌లో నిర్వహించిన కాళోజి తెలుగు వెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు వెలుగు సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నంది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. వేదిక గౌరవ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, భాషా సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, పోరాజు రాజ్ కుమార్, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు చేతుల మీదుగా ఈ నంది పురస్కారాన్ని అందుకున్నారు. వెయ్యికి పైగా మ్యాజిక్ మాట్లాడే బొమ్మ ప్రదర్శనలు ఇచ్చి ఇంద్రజాల కళా రంగంలో ప్రత్యేక నైపుణ్యం సాధించిన వేముల రాంబాబుకి నంది పురస్కారంతో పాటు జ్ఞాపిక ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు.